జగదభి రామ.. జానకి రామ

- ఊరూరా మార్మోగిన జైశ్రీరామ్ నినాదాలు
- కనుల పండువగా కల్యాణ వేడుకలు
- తిలకించి పులకించిన భక్తులు

అయోధ్య రామ మందిరంలో బాలరాముని ప్రాణప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం జిల్లావ్యాప్తంగా జై శ్రీరామ్ నినాదాలు మార్మోగాయి. భక్తులు కాషాయ జెండాలు చేతబూని శోభాయాత్ర నిర్వహించారు. ఆలయాల్లో సీతారాముల కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించగా భక్తులు తిలకించి పులకించారు. పలు చోట్ల భక్తులు వీక్షించేందుకు వీలుగా ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. రామాలయాల్లో అన్నదానం నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.


గజ్వేల్‌రూరల్: పూజలు నిర్వహిస్తున్న భక్తులు


ప్రశాంత్‌నగర్: మంగళహారతులతో మహిళలు


నంగునూరు(సిద్దిపేట): పాలమాకులలో రాములోరి కల్యాణ వేడుకలు


హుస్నాబాద్: బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠను ఎల్ఈడీలో వీక్షిస్తున్న భక్తులు


దుబ్బాకలో..


వర్గల్‌లో సీతారాముల శోభాయాత్ర


వెల్కటూర్‌లో సీత, రాముడు, లక్ష్మణుడి వేషధారణలో చిన్నారులు


ప్రశాంత్‌నగర్: శ్రీరామ రావణ యుద్ధ సన్నివేశంలో చిన్నారులు


బెజ్జంకిలో మహిళల కోలాటం


హుస్నాబాద్: రామాలయంలో మహిళల భజన


చేర్యాల: పూజలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

క్లుప్తంగా

విద్యార్థులకు చెకుముకి టాలెంట్ టెస్ట్


ప్రశ్నపత్రాలను విడుదల చేస్తున్న గజ్వేల్ నోడల్ అధికారి కృష్ణ

గజ్వేల్: జన విజ్ఞాన వేదిక (జేవీవీ) అధ్వర్యంలో సోమవారం హైస్కూల్ స్థాయి విద్యార్థులకు చెకుముకి టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. మండలంలోని 15 పాఠశాలల్లో ఈ టెస్ట్ జరిగింది. గజ్వేల్ మండల నోడల్ అధికారి కృష్ణ చేతుల మీదుగా ప్రశ్నాపత్రాలను విడుదల చేశారు. ఈసందర్భంగా జేవీవీ రాష్ట్ర కార్యదర్శి నర్సింలు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న సైన్స్ ప్రతిభను వెలికి తీయడమే లక్ష్యంగా తెలంగాణ సమగ్ర శిక్ష సహకారంతో టాలెంట్ టెస్ట్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, ఉపాధ్యాయునులు అనురాధ, మంజుల పాల్గొన్నారు.

సన్మానం


సంపత్‌కుమార్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

హుస్నాబాద్: కవి సాయంత్రం గ్రూపు వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని నాచారం ప్రతిభ పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రముఖ కవి, కళాకారుడు ముక్కెర సంపత్ కుమార్‌ను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కవి సాయంత్రం గ్రూపు సోషల్ మీడియాలో సుమారు 1200 మందితో సాహిత్య గ్రూపును నిర్వహిస్తూ అనేక ప్రక్రియల ద్వారా నూతన రచయితలకు ప్రోత్సాహం అందిస్తున్నందుకు గానూ సంపత్ కుమార్‌ను సన్మానించారు.


రాజ్యాంగంపై అవగాహన అవసరం

మిరుదొడ్డి(దుబ్బాక): భారత రాజ్యాంగం పట్ల ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) జిల్లా ఉపాధ్యక్షుడు భీమ్ శేఖర్ అన్నారు. డీబీఎఫ్ ఆధ్వర్యంలో మిరుదొడ్డిలోని కేజీబీవీ బాలికల విద్యాలయంలో భారత రాజ్యాంగంపై విద్యార్థినులకు సోమవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యాసరచన పోటీలను డీబీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కేజీబీవీ బాలికల విద్యాలయం స్పెషల్ ఆఫీసర్ స్వర్ణలత, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హుస్నాబాద్: హుస్నాబాద్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో 33 కేవీ వాటర్ గ్రిడ్ ఫీడర్ మరమ్మతుల కారణంగా మంగళవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు హుస్నాబాద్ మున్సిపల్ పరిధితో పాటు హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన


విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంవీఐ జనార్దన్‌రెడ్డి

హుస్నాబాద్: జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకొని పట్టణంలోని సెయింట్ జోసఫ్ పాఠశాలలో ఎంవీఐ జనార్దన్‌రెడ్డి రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ రూల్స్‌పై సోమవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్ కుమార్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

చిన్నకోడూరు(సిద్దిపేట): కురుమ సంఘం క్యాలెండర్‌ను సోమవారం చిన్నకోడూరులో నాయకులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా మండల కురుమ సంఘం అధ్యక్షుడు సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో గొర్రెల పంపిణీ పథకం కింద కురుమలు డీడీలు తీసి తీసిన గొర్రెల యూనిట్లు పంపిణీ చేయలేదన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు తిరుపతి, రవి, నర్సింలు, ఎల్లేష్, జగ్గయ్య, కిషన్, తిరుపతి, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ముగుస్తున్న పదవీ కాలం.. బిల్లులు రాక అయోమయం



పద్మశాలిగడ్డ పంచాయతీ కార్యాలయం

- అప్పుచేసి అభివృద్ధి పనులు
- ఆందోళనలో సర్పంచ్‌లు

దుబ్బాకరూరల్: సర్పంచ్‌ల పదవీ కాలం ఈనెల చివరి వరకు ముగియనుంది. అయితే బిల్లులు రాక పోవడంతో అయోమయానికి గురవుతున్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు ఇప్పటికీ పూర్తి కాలేదు. నూతనంగా ఏర్పడిన గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాలు సైతం అసంపూర్తిగానే ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో ప్రతి గ్రామంలో డంప్ యార్డులు, శ్మశాన వాటికలు, క్రీడా ప్రాంగణాలు, పల్లె ప్రకృతి వనాలు ఎన్ఆర్ఈజీఎస్ నిధులు ద్వారా నిర్మించారు. కొన్ని గ్రామాల్లో చేసిన పనులకు బిల్లులు రానప్పటికీ సర్పంచ్‌లు అప్పు చేసి వాటి నిర్మాణాలను పూర్తి చేశారు. పదవీ కాలం ముగింపు దగ్గర పడినా బిల్లులు విడుదల కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు, కమ్యూనిటీ, కుల సంఘాల భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. కొన్నింటికీ టెండర్లు అయినప్పటికీ పనులు చేపట్టలేదు. కొన్ని అసంపూర్తిగానే ఉన్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో చేసిన పనులకు బిల్లులు వస్తాయో రావోనని సర్పంచ్‌లు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని పద్మశాలిగడ్డ నూతన పంచాయతీగా ఏర్పడింది. గ్రామ పంచాయతీ భవనం ఇంకా పూర్తి కాకపోవడంతో ప్రభుత్వ పాఠశాలలోనే కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. పల్లె ప్రకృతి వనానికి రూ. 3 లక్షలు అప్పుల చేసి నిర్మాణాన్ని పూర్తి చేసినా ఇప్పటివరకు నిధులు రాలేదు. సర్పంచ్‌ల పదవీ కాలాన్ని పొడిగించి పనులు పూర్తి చేసి బిల్లులు ఇవ్వాలని సర్పంచ్‌లు డిమాండ్ చేస్తున్నారు.

ఘనంగా కళాశాల వార్షికోత్సవం


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

దుబ్బాకటౌన్: పట్టణంలోని ఎస్ఆర్ జూనియర్ కళాశాల వార్షికోత్సవం సోమవారం అట్టహాసంగా జరిగింది. ఈసందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ భాస్కర్‌రావు మాట్లాడుతూ.. కళాశాలలో చదివిన ఎందరో విద్యార్థులు నేడు దేశంలో గొప్పస్థాయిలో ఉండడం సంతోషకరమన్నారు. కళాశాలకు చెందిన విద్యార్థినులు జాతీయ, రాష్ట్ర స్థాయి వాలీబాల్ టీంకు ఎంపిక కావడంతో వారిని ఘనంగా సన్మానించారు.

తపాస్‌పల్లితో చెరువులు నింపాలి


మాట్లాడుతున్న అశోక్

చేర్యాల(సిద్దిపేట): తపాస్‌పల్లి రిజర్వాయర్ నీటితో చేర్యాల ప్రాంత చెరువులు నింపాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. మెట్ట ప్రాంతం కావడంతో చెరువుల్లో నీరు లేక భూగర్భ జలాలు అడుగంటిపోయి పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తపాస్‌పల్లి రిజర్వాయర్ నీటిని చేర్యాల ప్రాంత రైతాంగానికే అందించాలి కానీ మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు వారి ప్రాంతాలకు అక్రమంగా తరలించుకుపోయారని విమర్శించారు. ఇప్పటికైనా ఈ ప్రాంత రైతులను దృష్టిలో ఉంచుకొని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి స్పందించి తపాస్‌పల్లి రిజర్వాయర్ నీరు ఇతర ప్రాంతాలకు తరలిపోకుండా చూడాలన్నారు. లేనిపక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు భూమయ్య, యాదగిరి, కనకయ్య, బాలరాజు పాల్గొన్నారు.

జీపీ కార్యాలయం ప్రారంభం


పాలకవర్గంతో సర్పంచ్ ఎల్లారెడ్డి, తదితరులు

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని ముస్త్యాలలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని సోమవారం సర్పంచ్ పెడతల ఎల్లారెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలకు సుపరిపాలన అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం గ్రామాల్లో నూతన గ్రామ పంచాయతీ కార్యాలయాలు నిర్మించిందన్నారు. ఎన్ఆర్ఈజీఎస్, మంత్రి నిధులతో పాటు గ్రామ పంచాయతీ నిధులతో ఈ భవనాన్ని పూర్తి చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్, పంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు దుస్తుల పంపిణీ

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలోని మనోచేతన దివ్యాంగులకు ఇప్ప నిశికాంత్‌రెడ్డి సహకారంతో అందించిన దుస్తులను సోమవారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనోచేతన సంస్థ దివ్యాంగులకు అందిస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. ఆయన వెంట మనోచేతన నిర్వాహకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

బహిరంగ ప్రకటన

[illegible] కాపర్తి నాగరాజు, తండ్రి: చిన్నలింగం, చిరునామా: సిద్దిపేట, జిల్లా సిద్దిపేట-502103 [illegible] ఏడు (7) దినములలో [illegible]

ప్రాపర్టీ అడ్రస్: [illegible] 180.59 [illegible] 41, [illegible] 38, [illegible] 18.0 [illegible] 89 మరియు 80.

Sd/- Y. CHANDRA RUSHI, B.Sc., LLB, Advocate
1-2-273, Opp: Court Building, Brundavan Colony, JANGAON, Dist: Jangaon, Cell: 9848430926

రోడ్డు నిబంధనలపై అవగాహన


వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

అల్లాదుర్గం(మెదక్): రోడ్డు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు జరగవని ఏఎస్ఐ దేవీదాస్ చెప్పారు. సోమవారం 161 జాతీయ రహదారి చిల్వెర ఐబీ చౌరస్తాలో వాహనదారులకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారిపై రాంగ్‌రూట్‌లో ప్రయాణం చేయవద్దని, ఫోన్ మాట్లాడుతూ వాహనాలను నడపవద్దని సూచించారు.

ఘనంగా ఉర్సు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రంగంపేటలో గల ప్రసిద్ధ దర్గా షేక్ హుస్సేన్ ఉర్సు సోమవారం ఘనంగా నిర్వహించారు. 'పెద్ద గుట్ట' షేక్ హుస్సేన్‌కు ప్రతీకగా ఈ దర్గాను గ్రామంలో నెలకొల్పారు. ఉత్సవాల్లో భాగంగా దర్గాకు గంధం, పువ్వులు, చాదర్ ఊరేగింపుగా తీసుకువచ్చి సమర్పించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మతాలకు అతీతంగా ఈ ఉత్సవాల్లో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఎమ్మెల్యేను కలిసిన నాయకులు



బెజ్జంకి(సిద్దిపేట): మానకొండూర్ నియోజకవర్గ క్యాంపు కార్యాలయాన్ని సోమవారం తిమ్మాపూర్ మండలంలోని ఎల్ఎండీ కాలనీలో ప్రారంభించారు. ఈసందర్భంగా నాయకులు ఎమ్మెల్యే కవ్వంపెల్లి సత్యనారాయణకు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో బెజ్జంకి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, మండల పార్టీ అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, పోచయ్య, కృష్ణ, రవి, డీవీరావు, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

◆ మైక్ సెట్ అందజేత

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని రేబర్తికి చెందిన జిల్లా కాంగ్రెస్ నాయకుడు మార్నెళ్ల భాస్కర్ రెడ్డి గ్రామంలోని రామాలయానికి రూ. 32 వేల విలువ గల మైక్ సెట్‌ను సోమవారం అందించారు.

◆ బంద్ పాటించిన మద్యం దుకాణాలు

హుస్నాబాద్: అయోధ్య రామమందిరంలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా సోమవారం పట్టణంలోని మద్యం, మాంసం దుకాణాలు, స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం వరకు బంద్ పాటించి అయోధ్య రాముడి సేవలో భాగస్వాములయ్యారు.

◆ నూతన కార్యవర్గం

సిద్దిపేటజోన్: సిద్దిపేట తంజీముల్ మసాజిత్ నూతన అధ్యక్షుడిగా జియావుద్దీన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం పట్టణంలో జరిగిన కార్యక్రమంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా సర్వర్, ఉపాధ్యక్షుడిగా ఉబేద్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు జుబేర్



హుస్సేన్, కౌన్సిలర్లు వజీర్, మోహిజ్, రియాజ్, అర్షద్, ప్రతినిధులు పాల్గొన్నారు.

◆ ప్రజావాణిలో సర్పంచ్‌పై ఫిర్యాదు

కొండపాక(గజ్వేల్): పంచాయతీ నిర్వహణ కోసం ప్రభుత్వం అందజేసిన ట్రాక్టర్‌ను సర్పంచ్ కిరణ్‌కుమార్‌చారి సొంత పనుల కోసం వాడుకుంటున్నాడని గ్రామానికి చెందిన సుదర్శన్‌చారి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పలు మార్లు ఎంపీడీఓ, ఎంపీఓ, పంచాయతీ కార్యదర్శిల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని వాపోయారు. సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

దాతలు ముందుకురావడం అభినందనీయం


మాట్లాడుతున్న డీఈఓ రాధాకిషన్

వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల అభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని జిల్లా విద్యాధికారి డా.రాధాకిషన్ అన్నారు. పాఠశాల ఆవరణలో రూ.70లక్షల వ్యయంతో నిర్మించిన సైన్స్‌ల్యాబ్, గ్రంథాలయ భవనాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దాతలు ముందుకు వచ్చి లక్షల ఖర్చుతో ప్రభుత్వ పాఠశాలలో సైన్స్ ల్యాబ్, గ్రంథాలయ భవనం నిర్మించడమే కాకుండా సైన్స్ పరికరాలు, పుస్తకాలు, ఫర్నీచర్ ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. అనంతరం శాంత ఫౌండేషన్ లండన్ ప్రతినిధి విజయ భాయ్ పటేల్ మాట్లాడుతూ.. పాఠశాల విద్యార్థులకు పూర్తిసహకారం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, అంకిరెడ్డి గారి కేశవరెడ్డి ఫౌండేషన్ ప్రతినిధులు, ప్రముఖ వైద్యులు రామలక్ష్మి, ప్రణీతరెడ్డి, సుబ్రహ్మణ్యం, లయన్స్ క్లబ్ ప్రతినిధులు రూపాలి, ప్రకాశ్, శాంత ఫౌండేషన్ ప్రతినిధులు బికుభాయ్ పటేల్, స్మితభాయ్ పటేల్, శశి జాన్ పటేల్, తహసీల్దార్ జ్ఞానజ్యోతి, సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు కృష్ణారెడ్డి, హెచ్ఎం ముంతాజ్ అలీ పాల్గొన్నారు.